సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం | 29 | సెప్టెంబర్ | 2023



గంగమ్మ ఒడికి గణేషుడు



వినాయకునితో చిన్నారి





రాంభగీచ లడ్డూతో సునీల్‌చంద్

లడ్డూ... అ'ధర'హో

సిరిసిల్లటౌన్/సిరిసిల్లక్రైం: నవరాత్రి ఉత్సవాల్లో విశేష పూజలందుకున్న లడ్డూలు వేలంలో అదిరే ధరలు పలికాయి. పట్టణంలో ప్రతిష్ఠించిన భారీ వినాయకుడు రాంభగీచ మండపంలోని లడ్డూ అత్యధిక ధర పలికింది. సిరిసిల్లకు చెందిన కొమ్ముర్రాజుల సునీల్ చందు రూ.1,75,516కు దక్కించుకున్నారు.

- అందె రీచా రాజా గణేశ్ మండపంలోని లడ్డూను రూ.1,19,116లకు కాసర్ల శ్రీనివాస్ దక్కించుకున్నారు.
- గురుకులాశ్రమ సంఘంలో బండారి వెంకటేశం రూ.75,116 పాడారు.
- వర్తక సంఘంలో పుల్లూరి వేణు రూ.32,116 వేలంలో పొందారు.
- ఆర్యవైశ్య భవనంలో రవీందర్ రూ.10,116 దక్కించుకున్నారు.
- రెడ్డిసంఘంలో ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి రూ.30వేలకు వేలం పాడారు.
- శ్రీ విఘ్నేశ్వర యువజన సంఘంలో చింతకింద గౌరమ్మ–లక్ష్మీనారాయణ రూ.28,116 సొంతం చేసుకున్నారు.
- గోపాల్‌నగర్ చౌరస్తా శ్రీవిఘ్నేశ్వర నిలయంలో రూ.28,116లకు మచ్చ లలిత–అంబదాసులకు దక్కింది.
- వెంకంపేటలోని విజ్ఞరాజా మండపంలోని లడ్డూని ఆడెపు భాస్కర్ రూ.25 వేలకు దక్కించుకున్నారు.



అందె రీచా రాజా గణేశ్ లడ్డూతో కాసర్ల శ్రీనివాస్



ఆకట్టుకున్న మహిళల కోలాటం

బైబై గణేశా..

● ఘనంగా నిమజ్జనోత్సవం ● ఆది దేవుడికి అడుగడుగునా నీరాజనం

సిరిసిల్లటౌన్: తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న వినాయకునికి జిల్లా ప్రజలు వీడ్కోలు పలికారు. గురువారం ఉదయం నుంచే గణేశ్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. అర్ధరాత్రి వరకు కొనసాగాయి. జిల్లా కేంద్రంలోని విగ్రహాలను మానేరు వాగులో తవ్వించిన రెండు కృత్రిమ కొలనులలో నిమజ్జనం చేశారు. పట్టణంలోని అన్ని వాడల్లో కలిపి సుమారు 600లకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. డీజే సౌండ్స్.. రంగురంగుల విద్యుత్ దీపాల కాంతుల్లో వినాయకులు తరలివెళ్లారు. మున్సిపల్ నిధులు రూ.13 లక్షలతో ఏర్పాట్లు చేశారు. నిమజ్జన ప్రాంతంలో మూడు భారీ జనరేటర్లను ఏర్పాటు చేశారు. రెండు భారీ, ఒకటి సాధారణ క్రేన్‌లు, ఐదుగురు గజ ఈతగాళ్లను వినియోగించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో ఆనంద్‌కుమార్, తహసీల్దార్ షరీఫొద్దీన్, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, టౌన్ సీఐ ఉపేందర్, రూరల్ సీఐ సదన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్, సెస్ ఎండీ సూర్యచందర్‌రావు పరిశీలించారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డితోపాటు 11 మంది సీఐలు, 17 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, డిస్ట్రిక్ గార్డులు.. మొత్తంగా 220 మంది బందోబస్తు విధులు నిర్వర్తించారు. నిమజ్జనోత్సవం మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో సాగింది. సెస్ సిబ్బంది విధుల్లో ఉన్నారు.



సిరిసిల్లలోని రాంభగీచ వినాయకుని శోభాయాత్ర





నృత్యం చేస్తున్న మహిళలు



చిన్నారుల కోలాహలం



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గణేశ్ శోభాయాత్ర



వినాయకునితో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ



ఆటో యూనియన్ వినాయకుని శోభాయాత్ర



ఆకట్టుకున్న నృత్యాలు



బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

న్యూస్‌రీల్

ప్రశాంతంగా నిమజ్జనోత్సవం

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలో వినాయక నిమజ్జనోత్సవం ప్రశాంతంగా కొనసాగుతోందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. నిమజ్జన వేడుకలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, రూరల్ సీఐ సదానందం తదితరులు ఉన్నారు.

1 నుంచి అర్చకులకు శిక్షణ తరగతులు

వేములవాడఅర్బన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ధూప దీప నైవేద్యం స్కీం అర్చకులకు వివిధ ఆగమములలో నిష్ణాతులైన పండితుల ఆధ్వర్యంలో పునశ్చరణ(శిక్షణ) తరగతులు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ, ధర్మాదాయ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో అక్టోబర్ 1 నుంచి 3 వరకు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని వివరించారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి గురువారం నీటి విడుదల చేశారు. సాయంత్రం 7 గంటల వరకు ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా ఎల్‌ఎండీకి 11,500 క్యూసెక్కుల నీరు తరలుతోంది. మిడ్‌మానేరులోకి వరదకాల్వ ద్వారా 10 వేల క్యూసెక్కుల మేర ఎస్సారెస్పీ నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 24.54 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

రామగిరి సాహితీయాత్రకు జిల్లా కవులు

సిరిసిల్లకల్చరల్: రామగిరి సాహితీ స్నేహయాత్రకు జిల్లా నుంచి పలువురు కవులు తరలివెళ్లారు. పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ నేతృత్వంలో తలపెట్టిన ఈ స్నేహయాత్రకు జిల్లా నుంచి 20 మంది వరకు వెళ్లారు. యాత్రకు వెళ్లిన వారిలో వాసరవేని పరశురాం, డాక్టర్ జనపాల శంకరయ్య, వడ్నాల వెంకటేశ్, ఇమ్మడోజు మహేందర్, దుంపెన రమేశ్, గూడూరి బాలరాజు, సింగిరెడ్డి రాజిరెడ్డి, గుండెల్లి వంశీ తదితరులు ఉన్నారు.

కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎస్పీ, చైర్‌పర్సన్

సిరిసిల్లకల్చరల్: పాశ్చాత్య సంస్కృతి ప్రభావానికి లోను కాకుండా భారతీయ కుటుంబ వ్యవస్థను పరిరక్షించుకోవాలని భజరంగ్‌దళ్ తెలంగాణ ప్రాంత సమన్వయకర్త శివరాం కోరారు. హిందూ ఉత్సవ సమితి సారథ్యంలో జిల్లా కేంద్రంలోని గాంధీ సర్కిల్‌లో గురువారం స్వాగత వేదిక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానవక్తగా హాజరై మాట్లాడారు. సనాతన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు పండుగలను పవిత్ర వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. నిమజ్జన వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. బాలా త్రిపుర సుందరి కూచిపూడి శిక్షణాలయం చిన్నారులు తమ సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. మాజీ చైర్‌పర్సన్ ఆడెపు రవీందర్, ఉత్సవ సమితి అధ్యక్షుడు చేపూరి శ్రీనివాస్, ప్రతినిధులు గాజుల వేణు, మేర్గ సత్యనారాయణ పాల్గొన్నారు. వేడుకల్లో ఉత్సవ సమితి సభ్యులు వేముల పోశెట్టి, కోడం ఆనంద్‌బాబు, గాజుల సదానందం, బైరగోని వెంకన్న, గోనె మల్లేశం, శ్రీనివాస్, తడుక విజయ్, బొజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో సైంటిస్టుగా సిరిసిల్ల కుర్రాడు



ఉద్యోగం సాధించిన మంచికట్ల సుశాంత్‌వర్మ



తల్లిదండ్రులు సుధారాణి–రాజేశంతో సుశాంత్‌వర్మ

- తిరువనంతపురంలో నియామకం
- విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై మక్కువ

సిరిసిల్ల: సిరిసిల్ల చిన్నోడు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)లో సైంటిస్టుగా నియామకమయ్యారు. సిరిసిల్లకు చెందిన మంచికట్ల సుశాంత్‌వర్మ తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో సైంటిస్టుగా ఉద్యోగం సాధించారు. సుశాంత్‌వర్మ ప్రాథమిక విద్య కరీంనగర్ కేంద్రీయ విద్యాలయంలో పూర్తి చేశారు. వివేకానంద కాలేజీలో ఇంటర్ పూర్తి చేసి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ టెక్నాలజీలో బీటెక్ పూర్తి చేశారు. బీటెక్ పూర్తికాగానే సుశాంత్‌వర్మ మెరిట్ విద్యార్థిగా ఇస్రోలో సైంటిస్టుగా ఉద్యోగం సాధించాడు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థలో సైంటిస్టుగా నియమితులైన సుశాంత్‌వర్మ చిన్నప్పటి నుంచి పరిశోధనలపై ఆసక్తి కనబరిచేవారు. సుశాంత్ తల్లి సుధారాణి బోయినపల్లి మండలం వర్ధవెల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుండగా.. తండ్రి రాజేశం సిరిసిల్ల మున్సిపల్ మెప్మా విభాగంలో కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. సుశాంత్‌వర్మ సైంటిస్టుగా ఇస్రోలో ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులు సుధారాణి, రాజేశం గురువారం సంతోషాన్ని వ్యక్తం చేశారు.



టీచర్ల ర్యాంకుల్లో గోల్‌మాల్!

జీహెచ్‌ఎం పదోన్నతుల్లో కొన్ని పొరపాట్లు		
సీనియారిటీ సంఖ్య	ప్రస్తుత ర్యాంకు	317 జాబితా ర్యాంకు
734	75	చూపించలేదు
736	182	158
743	217	175
762	300	194

బదిలీలు (గణిత ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టు

జిల్లా	సీనియారిటీ సంఖ్య	ప్రస్తుత ర్యాంకు	317 జాబితా ర్యాంకు
జగిత్యాల	02	675	2,163
జగిత్యాల	25	685	2,191
జగిత్యాల	31	334	681
సిరిసిల్ల	01	430	507
సిరిసిల్ల	02	221	568
సిరిసిల్ల	06	683	751

- 317 జీవో టైంలో ఒకలా, పదోన్నతులు, బదిలీల్లో మరోలా!
- పొరపాటైతే సవరణకు, స్కాం అయితే విచారణకు టీచర్ల డిమాండ్
- తప్పుడు సీనియారిటీ చూపించినవారి పదోన్నతి రద్దు
- 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆర్జేడీ ఆదేశాలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: విద్యాశాఖ చేపట్టిన పదోన్నతులు, బదిలీలు వివాదాస్పదమవుతున్నాయి. ఇటీవల జీహెచ్‌ఎం బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. స్పందించిన విద్యాశాఖ కమిషనర్ దేవసేన చర్యలు తీసుకోవాలని డీఈవోలను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇది మరవకముందే.. మరిన్ని వివాదాలు విద్యాశాఖను చుట్టుముడుతున్నాయి. ఓవైపు పదోన్నతులు, బదిలీల్లో అనేక పొరపాట్లు, తప్పులు దొర్లుతున్నాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ ప్రక్రియ జరుగుతున్న తీరుపై అనేక సందేహాలు వ్యక్తమయ్యేందుకు కారణమవుతోంది. తాజాగా నిర్మల్ డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న ఓస్కూల్ అసిస్టెంట్ సీనియారిటీ లేకున్నా.. పదోన్నతి పొందిన విషయమై ఆర్జేడీకి బాధిత టీచర్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి, పొరపాటు గ్రహించిన అధికారులు పదోన్నతి రద్దు చేసి, అర్హుడైన ఉపాధ్యాయుడికి పదోన్నతి కల్పించారు. సీనియారిటీలో వెనకబడి ఉన్నా.. పదోన్నతి ఎలా వచ్చిందో 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని సదరు టీచర్‌ను ఆర్జేడీ ఆదేశించారు.



జగిత్యాల డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

పదోన్నతుల్లో ప్రామాణికం..

2021లో 317 జీవో అమలులో భాగంగా పలువురు టీచర్లను సీనియారిటీ ఆధారంగా వివిధ జిల్లాలకు కేటాయించారు. అప్పుడున్న లిస్టులో డీఎస్సీ ర్యాంకులు స్థానికత నిర్ధారణలో కీలకంగా వ్యవహరించాయి. తాజాగా బదిలీలు, పదోన్నతుల్లోనూ అధికారులు వాటిని ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అయితే, చాలా జిల్లాల్లో ఈ ర్యాంకులు 317 జీవో సమయంలో ఒకలా, ప్రస్తుతం మరోలా ఉండటం చూసి తోటి టీచర్లు అవాక్కవుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు, పదోన్నతుల్లో ర్యాంకులకు, 317 జీవో సందర్భంగా జరిగిన కేటాయింపుల సమయంలో ఉన్న ర్యాంకుల్లో వ్యత్యాసాలు ఎందుకు వచ్చాయి? అన్న విషయం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా కరీంనగర్, పెద్దపల్లికి సంబంధించిన బదిలీల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకున్నా.. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో మాత్రం టీచర్ల ర్యాంకుల విషయంలో గతానికి, ప్రస్తుతానికి భారీ వ్యత్యాసాలు వెలుగుచూశాయి. దీనిపై అర్హులైన ఉపాధ్యాయులంతా అభ్యంతరం తెలియజేస్తూ.. తప్పులు సవరించాలని డీఈవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఉన్నతాధికారులు ఏం చెబుతారో?

317 జీవో అమలు సందర్భంగా స్థానికత విషయంలో టీచర్లకు అనేక చిక్కులు ఎదురయ్యాయి. ఆ సమయంలో డీఎస్సీ ర్యాంకులను కూడా ప్రామాణికంగా తీసుకుని జిల్లాలకు కేటాయించారు. తాజా పదోన్నతులు, బదిలీలకూ అవే కీలకం. ఈ రెండింటిలో భారీ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోన్న వేళ.. ఏ ర్యాంకులు నిజం? అన్న ప్రశ్నకు ఉన్నతాధికారులు సమాధానమివ్వాల్సి ఉంది. ఒకవేళ 317 బదిలీల్లో ఉపయోగించిన ర్యాంకులే పొరపాటైతే.. జిల్లాలకు జరిగిన టీచర్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగి ఉంటాయని టీచర్లు అనుమానిస్తున్నారు. లేదా ప్రస్తుతం పదోన్నతులు, బదిలీల్లో చూపించిన ర్యాంకుల్లో తప్పులు ఉంటే.. సవరించి న్యాయం చేయాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉద్దేశపూర్వకంగానే తప్పుడు వివరాలిచ్చారా?

317 జీవో సమయంలో విద్యాశాఖ టీచర్ల ర్యాంకులు పొందుపరిచింది. తాజా పదోన్నతులు, బదిలీల్లో మాత్రం హెచ్‌ఆర్‌ఎంఎస్ వెబ్‌సైట్‌లో స్వయంగా నమోదు చేసుకున్న ర్యాంకులను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అందువల్ల ఈ పొరపాట్లు, వ్యత్యాసాలు తలెత్తుతున్నాయని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు వివరాలు నమోదు చేసిన టీచర్లపై, సదరు సమాచారాన్ని ధ్రువీకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

క్లుప్తంగా

చేనేత సెల్ ఉపాధ్యక్షుడిగా సాగర్



సిరిసిల్లఅర్బన్: జిల్లా కాంగ్రెస్ పార్టీ చేనేత సెల్ ఉపాధ్యక్షుడిగా గాజుల సాగర్‌ని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప తెలిపారు. ఈమేరకు గురువారం నియామకపత్రం అందించారు. పట్టణాధ్యక్షుడు ప్రకాశ్, వంగ మల్లేశం తదితరులు ఉన్నారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

గణేశ్ నిమజ్జనంలో తప్పిపోయిన బాలుడు



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బాలుడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలో గురువారం వినాయక నిమజ్జన వేడుకల్లో గుర్తు తెలియని ఐదేళ్ల బాలుడు తప్పిపోయాడు. స్థానిక బీజేపీ నాయకుడు కిరణ్‌కుమార్ బాలుడిని పోలీసులకు అప్పగించాడు. బాలుడి తనకు సంబంధించిన వివరాలు చెప్పలేకపోతున్నాడు. బాలునికి సంబంధించిన వారు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లాలని పోలీసులు కోరుతున్నారు.

దొంగతనం వేధింపులు భరించలేక హత్య



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి(వేములవాడ): దొంగతనం చేస్తున్నావని తరచూ వేధించడాన్ని తట్టుకోలేకనే మైనర్ బాలుడు(17) పులి గంగారంను హత్య చేశాడని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. చందుర్తి సీఐ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. హో టల్ పని చేసుకుని జీవించే గంగారం మంగళవారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని ఓ షట్టర్ ముందు నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడు బండ రాయితో మోది హత్య చేశాడు. అనుమానం రాకుండా ఉండేందుకు గ్రామంలోని ఓ ప్రజాప్రతినిధి భర్తకు ఫోన్‌చేసి షట్టర్ ముందు ఎవరో పడిపోయి ఉన్నాడని ఫోన్ చేసి తెలిపాడు. హత్య కేసులో నిందితుడైన మైనర్‌ను అరెస్టు చేసి వరంగల్‌లోని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ వివరించారు.

ముగ్గురిపై కుక్కల దాడి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేటలో గురువారం ఒక్క రోజే పిచ్చికుక్క ముగ్గురిపై దాడి చేసింది. ఆవులషెడ్డు వద్ద పనిచేస్తున్న బిహార్ కూలీని, అదే ప్రాంతంలో ఉన్న ఓ మహిళతోపాటు దూడను కరిచింది. అంతటితో ఆగకుండా అదే ప్రాంతంలో ఓ ఇంటి ముందు ఆడుకుంటున్న ఐదేళ్ల బాలుడిని కరిచింది. వరుస కుక్కల దాడులతో మండల కేంద్రం ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కుక్కల బెడద తప్పించాలని కోరుతున్నారు.

‘చీపురుతో ఇంటి ముందున్న నీటిని తొలగిస్తున్న ఈ మహిళ పేరు అన్నారం కనకవ్వ(55). సిరిసిల్లలోని సంజీవయ్యనగర్‌కు చెందిన కనకవ్వ నిత్యం ఇలా ఇంటి ముందున్న నీటిని తొలగించాల్సిందే. ఇదేదో వర్షం పడితే వచ్చిన వరదనీరు కాదు.. మున్సిపల్ అధికారులు మధ్యలో వదిలేసిన డ్రెయినేజీతో మురికినీరు ఇలా రోడ్డుపైకి వస్తుంది. ఇంటి ముందు మురికినీరు నిలిచి.. కంపు కొట్టడం భరించలేక కనకవ్వ చీపురుతో తొలగిస్తుంది. ఒక్క కనకవ్వనే కాదు.. సంజీవయ్యనగర్ వీధిలో అందరి పరిస్థితి ఇదే.’



‘ఇది కూడా సంజీవయ్యనగర్ వీధిలోని దృశ్యమే. నల్లా నీటిలో వీధిలోని మురికినీరు కలువకుండా ఇలా జాగ్రత్తగా పట్టుకుంటున్నారు. నల్లా నీరు, మురికినీరు ఒకే చోట కలిసిన అనుబంధం సంజీవయ్యనగర్‌లో కనిపిస్తుంది. ముక్కుపుటలు అదిరిపోయే దుర్వాసన మధ్య మంచినీటిని పట్టుకునే ఈ దుస్థితి సంజీవయ్యనగర్ ప్రాంత ప్రజలది.’



ఇదేనా స్వచ్ఛత?

- రోడ్డుపై పారుతున్న మురికినీరు
- కంపుకొడుతున్న సంజీవయ్యనగర్
- నిత్యం ఇవే తిప్పలు
- పట్టించుకోని పాలకులు



మురికి నీటితో సిరిసిల్ల సంజీవయ్యనగర్ వీధి

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని సంజీవయ్యనగర్ శివారు ప్రాంతం కాదు. పాతబస్టాండు ముందే సంజీవయ్యవిగ్రహం వెనక ఉంటుంది. డాక్టర్స్ స్ట్రీట్‌గా పిలిచే ఈ వీధిలోకి వెళ్లాలంటే నిత్యం ఉదయం వేళ మురికినీటిలో కాలు మోపాల్సిందే. ఊరులోని కంపు అంతా ఆ మురికినీరు మోసుకొస్తే.. ఆ దుర్వాసనను భరిస్తున్నారు స్థానికులు. కాలినడకన వచ్చే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. వర్షం పడినప్పుడు ఈ వీధి మొత్తం నిండా మురికినీరు, వరదనీటితో నిండా రాకపోకలు నిలిచిపోతాయి. సంజీవయ్యనగర్, అనంతనగర్ వాసులకు ఈ మార్గం ప్రధానమైంది కావడంతో ఈ ప్రాంతంలోని ఓ 800 ఇళ్ల వారికి నిత్యం ఈ కష్టాలు తప్పడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేవారు లేరు. స్థానిక కౌన్సిలర్ లక్ష్మీరాజం కరోనా సమయంలో మరణించగా.. ఆ స్థానానికి మళ్లీ ఎన్నికలు నిర్వహించలేదు.

ఈ సమస్యకు కారణమేంటి ?

వెంకంపేట, పద్మనగర్ ప్రాంతం నుంచి వచ్చే ప్రధాన మురికికాల్వను కొత్త చెరువులో కలువకుండా కట్టడి చేస్తూ.. మురికినీటి శుద్ధి ప్లాంటు (ఎస్‌టీపీ)ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటు నిర్మాణం లోపభూయిష్టంగా ఉండడంతో రూ.2.50కోట్లు మురికికాల్వ పాలు అయ్యాయి. ఈ కాల్వకు అడ్డంగా ఎస్‌టీపీ ప్లాంటు ఉండడం, మురికినీరు నేరుగా వెళ్లకుండా కాల్వ దాటి వచ్చి సంజీవయ్యనగర్ మోరీల్లో కలుస్తుంది. దీంతో నిత్యం ఉదయం అందరి ఇళ్లలో నీటి వినియోగం ఎక్కువగా ఉండడంతో ప్రధాన కాల్వ మురికినీరు, ఇళ్లలో వాడే అదనపు మురికినీరు కలిసి సంజీవయ్యనగర్ వీధిలో రోడ్డుపైన ప్రవహిస్తుంది. మురికినీరు తగ్గగానే నిత్యం బురద మిగులుతోంది. కానీ ఆ వీధిలో కంపు మాత్రం రోజంతా వదలడం లేదు.

ఇప్పుడేం చేయాలి

ప్రధాన మురికికాల్వ నీరు రాకుండా కట్టడి చేయాలి. లేదా ఇక్కడి మురికికాల్వను విస్తరించాల్సిన అవసరం ఉంది. ఈ రెండు పనుల్లో ఏదో ఒక్కటి చేస్తేనే సంజీవయ్యనగర్ వీధిలో మురికి నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అప్పటి వరకు నిత్యం రోడ్డెక్కే మురికినీటితో ఆ వీధి ప్రజలు గడపాల్సిందే. స్వచ్ఛత అవార్డులను జాతీయస్థాయిలో సాధించిన సిరిసిల్ల పట్టణానికి ఈ మురికి సమస్య మచ్చగా మారింది. ఇప్పటికైన మున్సిపాల్ పాలకవర్గం స్పందించి రోడ్డెక్కుతున్న మురికి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

పరిశీలించి పరిష్కరిస్తాం



సంజీవయ్యనగర్‌లో మురికి నీటి సమస్య మా దృష్టికొచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం. రూ.2 లక్షలతో మురికి నీటిని మళ్లించేందుకు ప్లానింగ్ చేశాం. సంజీవయ్యనగర్‌లో మురికినీరు రోడ్డు ఎక్కకుండా పనులు చేపడతాం.

– మహ్మద్ ఆయాజ్, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

హోరెత్తిన నిరసనలు

- కొనసాగుతున్న ధర్నాలు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసనలు హోరెత్తించారు. తమ డిమాండ్ల సాధనకు చేపడుతున్న నిరవధిక సమ్మెల్లో భాగంగా గురువారం ధర్నాలు చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు, అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమాలు హోరెత్తించారు.



ఎండల్లో మేము..ఏసీల్లో మీరు

మండుటెండల్లో మేము హక్కుల సాధనకు పోరాడుతుంటే రాష్ట్ర సర్కారు పట్టింపు లేకుండా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ఏసీల్లో ఉంటున్నారని ఆశవర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో మండుటెండల్లో గొడుగులు వేసుకుని ధర్నా చేపట్టి మాట్లాడారు. పనికి తగిన వేతనాలు ఇవ్వాలని, ఫిక్స్‌డ్ జీతం నెలకు రూ.18వేలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో ఆటపాటలతోనిరసన తెలిపి.. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు వినతిపత్రాలు ఇచ్చారు. ఆశవర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేణి మంజుల, ప్రధాన కార్యదర్శి జయశీల, చంద్రకళ, లత, రాణి, లావణ్య ఉన్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి



బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొండివైఖరి వీడి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వందలాది సంఖ్యలో దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేసే వరకు దీక్షను విరమించేది లేదన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, అంగన్‌వాడీ జేఏసీ జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, కొండికొప్పుల పద్మ, శ్యామల పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- 31 మొక్కలు 17 కిలోలు
- సీజ్ చేసిన పోలీసులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగుచేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని ఇంద్రానగర్‌కాలనీకి చెందిన వృద్ధుడు మహ్మద్ హైదర్ తన ఇంటి ముందు మొండిగోడల మధ్య ఉన్న పది అడుగుల స్థలంలో కొన్ని రోజులుగా గంజాయి సాగుచేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మండల పోలీసులు గురువారం సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దాడి చేశారు. పది అడుగుల స్థలంలో సాగుచేసిన 31 గంజాయి మొక్కలను సీజ్ చేసి హైదర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ గంజాయి మొక్కలు 17 కిలోలు ఉన్నట్లు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ మధు, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, ప్రశాంత్, ప్రశాంత్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయి మొక్కలను సీజ్ చేస్తున్న పోలీసులు

అభివృద్ధిపై చర్చకు రెడీ

- బండి సంజయ్ సవాల్ స్వీకరిస్తున్నాం
- సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

కరీంనగర్: సీఎం కేసీఆర్, కేటీఆర్‌లపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విసిరిన సవాల్‌కు తాము సిద్ధంగా ఉన్నామని, తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తామని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని భాగ్యలక్ష్మి, కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయాలలో ఎక్కడైనా.. ఎప్పుడైనా చర్చకు సిద్ధమని ప్రతిసవాల్ విసిరారు. నాలుగేళ్లలో ఎంపీగా పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధి ఏమిటో వెల్లడించాలని కోరారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తర్వాత ఒక్కరోజు ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో లేరన్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులుగా ఎంపిక చేస్తామని డబ్బుల వసూళ్లకు పాల్పడడంతోనే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించారన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్, కెమసారం తిరుపతి, తుల భాస్కర్‌రావు, గాలి రవియాదవ్ పాల్గొన్నారు.

ఓపెన్‌జిమ్‌కు నిధులు



ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మల్లాపూర్‌లో ఓపెన్ జిమ్, మహిళా సంఘం భవనం నిర్మాణానికి రూ.4 లక్షల చొప్పున రూ.8 లక్షలు మంజూరు ప్రొసీడింగ్స్ కాపీలను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గురువారం సర్పంచ్ ఇల్లెందుల శంకరయ్యకు అందించారు. ఎ మ్మెల్యే మాట్లాడుతూ యువత, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సింగిల్‌విండో చైర్మన్ వేసిరెడ్డి దుర్గారెడ్డి, కొండగట్టు ఆలయ డైరెక్టర్ బెంద్రం మాధవరెడ్డి, వేసిరెడ్డి లచ్చిరెడ్డి, బెంద్రం జీవన్‌రెడ్డి, వేసిరెడ్డి కార్తీక్, వల్లకొండ భూమిరెడ్డి, దురుమట్ల అంజిరెడ్డి, సాగర్‌రెడ్డి, వరాల అనిల్ తదితరులు ఉన్నారు.

పట్టపగలే నర్సింగాపూర్‌లో చోరీ

- రూ.15వేలు, 20 తులాల వెండి పట్టగొలుసులు చోరీ



చిందరవందరగా పడేసిన ఇంట్లోని సామగ్రి

చందుర్తి(వేములవాడ): దొంగలు బరితెగించారు. మండలంలో వరుస దొంగతనాలతో రెచ్చిపోతున్నారు. పట్టపగలే నర్సింగాపూర్‌లోని ఓ ఇంట్లో చొరబడి రూ.15వేలు నగదు, 20 తులాల వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన బైరగోని దేవేంద్ర కరీంనగర్‌లో ఉంటున్న తన కుమార్తె ఇంటికి పది రోజుల క్రితం వెళ్లింది. కొద్ది రోజులుగా తాళం వేసి ఉన్నట్లు గమనించిన దొంగలు పట్టపగలే ఇంట్లో చొరబడి రూ.15వేల నగదు, 20 తులాల వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. ఇప్పటికే మండలంలోని మల్యాల, గోస్కుల పల్లె గ్రామాల్లో దొంగతనానికి పాల్పడిన దొంగలను పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తుండగా.. నర్సింగాపూర్‌లో దొంగతనం జరగడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు.

పోలీస్ అధికారి ఇంట్లో చోరీ అవాస్తవం

- సీఐ శశిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని ఓ పోలీస్ అధికారి ఇంట్లో దొంగతనం జరిగినట్లు ప్రచారంలో వాస్తవం లేదని, పోలీస్ వ్యవస్థను అప్రతిష్ట పాలు చేయడానికే ప్రచారం చేశారని సీఐ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. సర్కిల్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఓ పోలీస్ అధికారి ఇంట్లో చోరీ జరిగిందని, ఇంట్లో పనిచేసే వ్యక్తి చోరీకి పాల్పడ్డాడని కావాలని అసత్యపు పోస్టులు పెడుతున్నారన్నారన్నారు. ఇలాంటివి ప్రజలు నమ్మొద్దని కోరారు. పోలీసులపై తప్పుడు ప్రచారం చేసే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముస్తాబాద్‌కు 30 పడకల ఆస్పత్రి

- జీవో జారీ చేసిన ప్రభుత్వం
- రూ.10.70కోట్లు మంజూరు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలానికి ప్రభుత్వం ముప్పై పడకల ఆసుపత్రిని మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ జీవో జారీ చేసింది. తెలంగాణ వైద్యవిధానపరిషత్ ప్రతిపాదనలతో ముస్తాబాద్ మండలానికి 30 పడకల ఆస్పత్రి మంజూరుచేస్తూ జీవో విడుదలైంది. మంత్రి కేటీఆర్ ఆదేశాలతో వైద్య ఆరోగ్యశాఖ ముప్పై పడకల ఆస్పత్రితోపాటు రూ.10.70 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువరిచింది. చాలా రోజులుగా ముస్తాబాద్ మండలంలో 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ ఉంది. ప్రతిపక్ష పార్టీలు సైతం ఆందోళనలు చేపట్టాయి. ముప్పై పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) మంజూరుపై మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు



బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు

ముస్తాబాద్‌కు 30 పడకల ఆస్పత్రి మంజూరుపై బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక తెలంగాణచౌక్‌లో సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చి.. స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు మాట్లాడుతూ మండల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా ముప్పై పడకల ఆసుపత్రిని మంజూరు చేశారన్నారు. త్వరలోనే ఆసుపత్రి నిర్మాణానికి మంత్రి కేటీఆర్ భూమిపూజ చేస్తారని తెలిపారు. జెడ్పీటీసీ నర్సయ్య, సర్వర్, కొండ శ్రీనివాస్, భరత్, మనోహర్, స్వామి, రాజమల్లు, బాల్‌నర్స్, నర్సింలు, జహంగీర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో ఒకరిపై దాడి

- పరిస్థితి విషమం.. ఆస్పత్రికి తరలింపు



రక్తపు మడుగులో పడి ఉన్న ప్రసాద్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కొలనూర్‌లో పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేయగా, మరొకరు సహకరించినట్లు సమాచారం. మండలంలోని కొలనూర్‌కు చెందిన మేర్గు కనకయ్య-కనకవ్వ దంపతుల కుమారుడు ప్రసాద్(28)పై అదే గ్రామానికి చెందిన మేర్గు బుచ్చిరాములు అతని కుమారులు తిరుపతి, అశోక్‌తో బుధవారం రాత్రి వాగ్వాదం జరిగింది. దీంతో ముగ్గురు కలిసి గొడ్డలి, కత్తులతో ప్రసాద్‌పై దాడిచేశారు. ఈ దాడిలో ప్రసాద్ నడుము, చేయి విరుగగా, తల నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతోపాటు దవడ పగిలి, పళ్లు రాలిపోయాయి. దాడికి పాల్పడిన వారికి గ్రామానికి చెందిన మరొకరు సహకరించారని సమాచారం. దాడి చేసిన తర్వాత ఈ నలుగురు మద్యం తాగినట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మేర్గు బుచ్చిరాములు, తిరుపతి, అశోక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

4న మాజీ సర్పంచుల యుద్ధభేరి



మాట్లాడుతున్న మాజీ సర్పంచులు

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: డిమాండ్ల సాధనకు పోరాటాన్ని ఉధృతం చేయడానికి సిద్ధమైనట్లు మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు దేవయ్య తెలిపారు. అక్టోబర్ 4న సిరిసిల్లలో ‘యుద్ధభేరి’ సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ప్రచార రథాన్ని గురువారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో ప్రారంభించి మాట్లాడారు. అన్ని మండలాలు, గ్రామాల్లో మాజీ సర్పంచులను ప్రచారం రథంతో చైతన్య పరుస్తామన్నారు. యుద్ధభేరి సభకు కవులు, కళాకారులు మేధావులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని తమకు సంఘీభావం తెలపాలని కోరారు. సంఘం ప్రతినిధులు ఎనగందుల వెంకన్న, గుమ్మడి కొండయ్య, అలువాల సుగుణ, లక్ష్మణ్, బోడ సత్తయ్య, స్వామి పాల్గొన్నారు.

అవినీతిపై పోరాటమే ఏఐఎఫ్‌బీ ధ్యేయం

- అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం
- ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ కటకం మృత్యుంజయం



మాట్లాడుతున్న మృత్యుంజయం

గంభీరావుపేట(సిరిసిల్ల): అవినీతిపై పోరాడుతామని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ కటకం మృత్యుంజయం పేర్కొన్నారు. గంభీరావుపేటలో గురువారం పలువురు నాయకులు పార్టీలో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మృత్యుంజయం మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో 119 అసెంబ్లీ, అన్ని పార్లమెంట్ స్థానాల్లో ఏఐఎఫ్‌బీ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు. త్వరలోనే ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల ముందుకు తెస్తామన్నారు. అవినీతి పరిపాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కూలదోస్తామన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదన్నారు. నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టును నింపే కాళేశ్వరం ప్యాకేజీ–9 పనులు ఎందుకు పూర్తి చేయలేదో మంత్రి కేటీఆర్ సమాధానం చెప్పాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మేకల కమలాకర్, మండలాధ్యక్షుడు గోపగారి నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు సుద్దాల భూమయ్య, నాయకులు నల్ల రాజ్‌కుమార్, వేశాల వెంకటి, గంధ్యాడపు శంకర్, గుడికాడి బాలయ్య, మొగిలాల దేవరాజుగౌడ్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో వృద్ధుని ఆత్మహత్య



ఎల్లయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన వృద్ధుడు ఆలకుంట ఎల్లయ్య (60) అప్పుల బాధ భరించలేక గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. ఎల్లయ్య తన కొడుకు నవీన్‌ను గల్ఫ్ దేశాలకు పంపడానికి, కూతురు వివాహానికి, కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురయ్యేవాడు. పని ఉందని బుధవారం ఉదయం బయటకు వెళ్లిన ఎల్లయ్య మధ్యాహ్నం ఇంటికొచ్చి వాంతులు చేసుకున్నాడు. అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు ఆరా తీయగా.. పురుగుల మందు తాగినట్లు తెలిపాడు. వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు నవీన్, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏసీబీ కాదు.. సివిల్ పోలీసులే

- ఎల్లారెడ్డిపేటలో దొంగ బంగారంపై ఆరా
- సిద్దిపేట పోలీసుల అదుపులో దొంగ
- ఇద్దరిని విచారిస్తున్న పోలీసులు



స్వర్ణకారుడి ఇంట్లో సిద్దిపేట పోలీసుల తనిఖీలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని ఓ స్వర్ణకారుని ఇంట్లో బుధవారం తనిఖీలు చేసింది ఏసీబీ అధికారులు కాదని.. సిద్దిపేటకు చెందిన సివిల్ పోలీసులు అని తెలిసింది. స్థానిక స్వర్ణకారుడు దొంగ బంగారం కొనుగోలు చేశాడన్న సమాచారంతో సోదాలు చేశారు. అయితే సదరు గోల్డ్‌స్మిత్ పరారీలో ఉన్నాడు. తనిఖీలు చేసింది ఏసీబీ అధికారులు కాదని.. సివిల్ పోలీసులు అని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి అదే అపార్ట్‌మెంట్‌లోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. దొంగిలించిన బంగారు ఆభరణాలను ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన తన బంధువుల ద్వారా ఎల్లారెడ్డిపేటలోని ఓ స్వర్ణకారునికి విక్రయించాడు. సిద్దిపేటలోని దొంగతనంపై విచారణ చేపట్టిన అక్కడి పోలీసులు దొంగను పట్టుకొని.. విచారించగా అసలు విషయం తెలిసింది. తన బంధువుతో కలిసి ఎల్లారెడ్డిపేటలో స్వర్ణకారునికి బంగారం అమ్మినట్లు చెప్పడంతో ముందుగా కొండాపూర్‌లో దొంగ బంధువును అదుపులోకి తీసుకొని వారిద్దరితో కలిసి స్వర్ణకారుడి ఇంటిపై దాడి చేసి సోదాలు చేశారు. సదరు స్వర్ణకారుడు ప్రస్తుతం పరారీలో ఉండగా, అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.